మాట్లాడుతున్నారు. ఆడపిల్లలున్న తల్లులు మరీ విశాలమైన నవ్వులతో పలకరిస్తున్నారు. గణపతిదేవుడు అన్నదమ్ములతోనూ.. చిన్ననాటి స్నేహితులతోనూ.. 'ఒరే! రారా! పోరా!' అనే సోదరులతోనూ పగలబడి నవ్వుతూ ముచ్చట్లు పంచుకుంటుండగా.. నారాంబకైతే పట్టపగ్గాలు లేవు. ఇంతమంది భర్త తరపు బంధువులు తనతో మాట్లాడటం ఆమెను పరవశింపజేస్తున్నది. అక్కలు, చెల్లెళ్లు, వదినలు, పెద్దమ్మలు.. పిన్నమ్మలు, మేనకోడళ్లు.. అందరితో వరసలు కలుపుతూ.. అందరిలో కలిసిపోతున్నది.

ఆమెను చూస్తూ జాయపుడు మురిసిపోతున్నాడు.

కానీ, అతని చూపులన్నీ తనను చుట్టుముడుతున్న చూపులను తప్పుకొని ఇంద్రాణిని చూడటానికి తహత హలాడుతున్నాయి. ఆమె కూడా చాలా మౌనంగా, బిడియంగా, మందస్మితంగా, మధురస్మితంగా.. అటూ ఇటూ చూస్తూ.. ఎవరితోనో మాట్లాడుతూ.. ఓ పసి పాపను ముద్దులాడుతూ.. శిరోజాలను సవరించు కుంటూ.. పైటను సున్నితంగా కదుపుతూ.. మరో చేత్తో కుచ్చిళ్లు సుతారంగా పట్టుకుని, జాయప చూపులతో చూపులు కలుపుతూ.. అప్పుడప్పుడూ తిరస్కారంగా తల తిప్పుకొంటూ.. మళ్లా అతను ఏమన్నా నొచ్చుకు న్నాడేమోనని బిడియపడుతూ మళ్లీ చూస్తూ.. కళ్లతో క్షమించమంటూ.. కాస్త మోహనత్వాన్ని చూపులతో కలిపి అతని కళ్లకు అందిస్తూ..

ఓ రసరమ్య మధుర వాహిని వారి తొలి సమాగమ వేళ వారి మధ్య ఉరికి దూకుతూ.. సుడులు తిరు గుతూ.. ఎత్తు పల్లాలను ఒరుసుకు ప్రవహిస్తున్నది.

ఉన్నట్టుండి ఎవరో అన్నారు..

''వెంగమాంబా! ఓ మంచి పాట పాడవచ్చు కదా!?'' అని.

అంతా తమతమ గుంపుచర్చల నుంచి బయటికి వచ్చి.. ఆ వెంగమాంబ వైపు చూపు సారించారు.

రాజకుటుంబీకులు అందరూ విద్యావంతులే! రాజ్యంలో పూర్తి విద్యావంతుల గ్రామం లేదా పురం ఉన్నదంటే.. అది రాజనగరి మాత్రమే. అందరూ చిన్న నాటి నుంచే నివాసంలో గురువును నియమించుకుని విద్యను అభ్యసిస్తారు. ధనుర్విద్య, యోగాసనాలు, అశ్వ, గజ, మల్లయుద్ధంతోపాటు న్యాయశాస్త్రం, రాజ నీతి శాస్త్రాలు, పురాణాలు, ప్రబంధాలు.. స్త్రీ పురుష లంతా విధిగా చదువుకుంటారు. పెద్దలు తప్పక నేర్పు తారు. రాచరికపు స్త్రీలు యుద్ధవిద్యలు నేర్వడం కూడా సాధారణమే! ఇక ప్రతి మహిళ ఏదో ఒక కళ పట్ల అభి రుచి పెంచుకుని ప్రాథమిక జ్ఞానంతో ఉంటారు. వారి ఆసక్తి, అభిరుచిని బట్టి నిష్ణాతులవుతారు. దాదాపు మహిళలంతా కొద్దో గొప్పో పాడగలరు. కనీసం శాస్త్రీయ సంగీతం లాంటిది విని ఆస్వాదించగలరు.

పూర్తిస్థాయి లిపి లేకపోవడం వల్ల చాలామంది తల్లులు.. పిల్లలతో ఇంట్లోనే పాడుతూ, పాడిస్తూ నేర్పు కోవడం కూడా సహజమే.

కానీ, ఇలాంటి సమావేశాలలో మంచి గాయకులు, గాయనీమణులు మాత్రమే ముందుకు వస్తారు. తెలిసిన వారు ప్రోత్సహిస్తారు. అప్పుడే కార్యక్రమం మరింత శోభాయమానం అవుతుంది.

వెంగమాంబ ఎవరోనని జాయపుడు ఆసక్తిగా చూశాడు. ఆమె ఓ యాభై ఏళ్ల ప్రౌఢ.

చాలామంది మహిళలు ఒత్తిడి చేయడంతో ఆమె పాడసాగింది. ఆమెను ఒత్తిడి చేసిన వారిలో ఇంద్రాణి కూడా ఉండటం జాయపుణ్ని ఉత్సాహపరిచింది. సహ జమే కదా.. ఈమె గాత్రం ఇంద్రాణికి తెలిసే ఉండాలి. ఓ వినాయక స్తుతి పాడింది సదరు వెంగమాంబ.

అందరూ చప్పట్లు కొట్టారు.

జాయపుని వంక చూసింది ఇంద్రాణి. ఆమె ముఖంలో ప్రశ్నార్థకం!

'పాట ఎలా ఉంది!?' అన్నట్లు. ఆమె తనను అలా అడుగుతుందని జాయపుడు ఊహించలేదు.

'సాధారణంగా ఉంది' అన్నట్లు ముఖం పెట్టాడు.

ఆమె కూడా..

'నాకూ అలాగే ఉంది' అన్నట్లు చూసింది.

దాంతో జాయపునికి కొంచెం హుషారు హెచ్చింది.

మరొకరు ఎవరో మరో పాట పాడారు. అయ్యాక మళ్లీ ఇద్దరూ అభిప్రాయాలు చెప్పుకొన్నారు.

'ఇదీ నీరసంగానే ఉంది!' అనే ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చారు.

మరొకరు మరో పాట.. 'కొంచెం బావుంది'.

మరొకరు మరో గీతం.. 'ఇంకా కొంచెం బావుంది' అనుకున్నారు.

హఠాత్తుగా ఒకామె అన్నారు..

''ఇంద్రాణీ! ఏదీ.. నువ్వొక పాట ఎత్తుకో!'' అని.

జాయపునిలో ఓ సంతోషపు అల మౌన శబ్దంతో ఉవ్వెత్తున ఎగిరింది. కారణం.. ఆమెతో పరిచయం లేక పోవడం వల్ల తానుగా అడగలేడు. అతని కోరిక మరొ కరు అడగడం ద్వారా తీరింది. ఇంద్రాణి అప్పుడు జాయపుని వంక చూడలేదు. తలొంచుకుని గొంతు సవరించుకుంది. ఆలాపన ప్రారంభించింది.

కళ్లు మూసుకుని తనలో తాను పాడుకుంటున్నట్లు.

'ఒహ్హో!'.. అనుకున్నాడు జాయపుడు.

ఆమె పూర్తిగా మనోధర్మం ప్రకారం పాడుతున్నది. అప్పుడే పాట నలుగురినీ కట్టి పడేస్తుందని జాయపుడు చదువుకున్నాడు.

''రేయి.. రేయి.. గోరువెచ్చని ఈ రేయి.. మరిమరీ ముద్దొస్తుందోయి.. మన రేయి.. మనిద్దరి రేయి..''

అప్రతిభుడయ్యాడు జాయపుడు. ఈ నాలుగురోజు లుగా పాట పెంపొందిస్తూ.. శ్రుతి, రాగం నిర్ణయం చేసి ఓ పథం.. ఓ ప్రవాహిని చేసిందన్నమాట. అతని కళా త్మక ఆర్తికి ఓ మధుర రుచి అందింది.

ఆ పాట.. ఆమె గాత్రం.. అందులోని మాధుర్యం అందరిని కట్టిపడేస్తున్నది. సంగీత విశిష్టత తెలిసిన ఆ బంధుజనం తన్మయత్వపు పథాలలో పయనిస్తున్నారు. ఆ పథంలో మూకుమ్మడిగా ఇంద్రాణి అద్భుతంగా తీసుకుపోతున్నది. ఈ అద్భుతం వెనక లేదా ముందు ఉన్నవి.. ఏడు స్వరాలు.

షడ్జమము, ఋషభము, గాంధారము, మధ్య మము, పంచమము, ధైవతము, నిషాదము.

క్లుప్తంగా చెప్పాలంటే సరిగమపదని.. అంతే! వీటిని సరళీ స్వరాలు అంటున్నారు సంగీతజ్ఞులు.

కేవలం ఈ ఏడుస్వరాలతో గాయకులు, సంగీత కర్తలు సృష్టిస్తున్న మహాసంగీత సముద్రాలు ఎన్నో. ఈ ఇంద్రాణి కూడా ఆ మహాసృష్టి వైపు వెళ్తున్నదా!? అన్నంత ఉన్నతంగా ఉన్నాయి ఆమె గానామృత తేనెవాకలు. పూర్తిగా లిఖించుకున్న పాటను పూర్తి విశ్వాసంతో తగిన ఆరోహణ అవరోహణ క్రమణికతో.. తన గానధర్మానికి తగిన శ్రుతితో.. అద్భుతమైన సృజ నాత్మక గమకాలతో పాడి, ఆ మందిరాన్ని రసభరితం చేసింది. పూర్వవ్వగానే కరతాళధ్వనులతో అందరూ తమ రసాస్వాదనను ప్రకటించారు.

ఎవరో అడిగారు..

''ఆరోజు ఎవరో చంటిపాప ఏడుస్తుంటే పాడావూ చూడు.. ఆ పాట పాడు ఇంద్రాణీ!'' అని.

ఇంద్రాణి నవ్వి..

''మీరూ ఆ రోజు విన్నారా.. అత్తమా?!'' అన్నది.. కించిత్ అబ్బుర ప్రకటనతో.

వాళ్ల సంభాషణ ఏమోగానీ, ఆమె మాటతీరు.. అందులో ధ్వనించే వినయమర్యాదలు కూడా విని సంతృప్తి చెందాడు జాయపుడు.

'స్వకీయంగా రంజించునది గాన దానిని స్వరం అన్నారు' అన్నాడో సంగీత గ్రంథకర్త. ఇంద్రాణి స్వరాన్ని స్వకీయంగా పలుకుతున్నది. అదే ఆమె గాత్ర విన్యాసం..

**''లల్లాయిలో.. లాయిలో.. లాయిలో.. లల్లాయిలో..**

**అమ్మను నేనే.. లల్లాయిలో.. నీ అమ్మను నేనే లల్లాయిలో**

**నువ్ నా అమ్మవు నాన్నవులే లాయిలో..**

**లల్లాయిలో.. లాయిలో.. లాయిలో.. లల్లాయిలో..''**

ఇది సాహిత్య ప్రధానంగా ఉన్న పాట. పాట భావాన్ని ఉన్నతం చేసి సంగీతాన్ని వెనుక నిలిపింది. అద్భుతం!!

అందరూ మౌనంగా.. చంటిపిల్లల్లా సున్నితంగా కద లాడుతున్నారు. ఆ పాటలోని తల్లీ పిల్లలమధ్య ఉండే తీవ్రమైన అనుబంధం.. తండ్రీ పిల్లలమధ్య ఉండే గాఢత.. రసరమ్యంగా అందరి హృదయాలలోని మాతృత్వాన్ని తట్టి కుదుపుతున్నది ఆమె.

ఆమె సందర్భోచిత గీతానికి.. అందుకు ఎంచుకున్న పథం.. అంటే ఎంచుకున్న రాగాన్ని పరికించి అచ్చెరు వొందాడు. ఈమె ప్రతిభావంతురాలు.. సందేహం లేదు. పాట పూర్తికావడం.. అందరూ ముక్తకంఠంతో ప్రశంసించడం జరిగిపోయాయి.

దాదాపు కార్యక్రమం చివరికి వచ్చింది. అప్పుడ న్నాడు మహామండలీశ్వరుడు గణపతిదేవుడు..

''మాంచి శాస్త్రీయగీతం ఏదైనా నువ్వు ఆలపిస్తే.. అందుకు అనుగుణంగా మా జాయపుడు నర్తిస్తాడు!''

ఆయనన్నది అర్థం కాక ఓ రెప్పపాటు హఠాత్తు నిశ్శబ్దత.. తర్వాత మందిరం చప్పట్లతో అదిరిపో యింది. సంభ్రమంతో చేసిన కూజితాలతో ఊగిపో యింది.ఇలా ఓ గాయని పాడుతుంటే తదనుగుణంగా ఓ నాట్యకారుడు నర్తించడమా!? అద్భుతం! ■

(సశేషం)



**అందరూ మౌనంగా.. చంటిపిల్లల్లా సున్నితంగా కదలాడుతున్నారు. ఆ పాటలోని తల్లీ పిల్లలమధ్య ఉండే తీవ్రమైన అనుబంధం.. తండ్రీ పిల్లలమధ్య ఉండే గాఢత.. రసరమ్యంగా అందరి హృదయాలలోని మాతృత్వాన్ని తట్టి కుదుపుతున్నది ఆమె.**